

పర్యాటకులకు నిరాశే..
దసరా సెలవుల్లో కవ్వాల్ సందర్శించాలను కునే వారికి ఈ సారి నిరాశే మిగిలింది. అక్టో బర్ నుంచే పర్యాటకులను అనుమతివ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. 8లో▸



నరక ప్రయాణం..! 9లో▸
జిల్లా కేంద్రం నుంచి తాంసి, తలమడుగు మండలాల మీదుగా గల అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయంగా మారింది. వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0
వాతావరణం
అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవ అతిథులు వీరే..

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అతిథులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండావిష్కరణ, గౌరవ వందనం స్వీకరిస్తారు. అభివృద్ధి పనులపై ప్రసంగిస్తారు. ఆదిలాబాద్ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంచిర్యాల జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, నిర్మల్ జిల్లాకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరు కానున్నారు.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లాస్థాయి బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను ఆయన ప్రా రంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లో నూ అత్యుత్తమంగా రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, పలువురు పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు, నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని ఆర్కిటెక్ ఇంజినీర్ అండ్ ఎల్బీపీ అధ్యక్షుడు అన్నదానం జగదీశ్ అన్నారు. ఇంజినీర్స్ డేను పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూ రావు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఈ కార్యాలయంలో..
కైలాస్‌నగర్: ఇంజినీర్స్ డే వేడుకలను జిల్లా పరిషత్‌లోని పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ రాథోడ్ శివరాం, డీఈ కుందన్, ఏఈలు సంతోష్, చంద్రశేఖర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ సాధనలో ముందుండాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో విశ్వవిద్యాలయ సాధన కోసం విద్యార్థులు, యువత ముందుండాలని యూనివర్సిటీ సాధన సమితి కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సోమవారం అవగాహన కల్పించారు. వర్సిటీ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్వోగా శ్రీనివాస్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి(డీపీఆర్వో)గా వి.శ్రీనివాస్ నియామకమయ్యారు. ఇది వరకు డీపీఆర్వోగా పని చేస్తున్న బి.తిరుమలను కామారెడ్డి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో హన్మకొండ అదనపు పీఆర్వోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడికి బదిలీ చేశారు.

'ఓపెన్' ప్రవేశ గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశ గడువు పొడిగించినట్లు డీఈవో ఖుష్బూ గుప్తా, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చని, నిర్ణీత అపరాధ రుసుముతో 20 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. వివరాల కోసం అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

మళ్లీ షురూ..

జైనథ్ మండలం ఆనంద్‌పూర్‌లోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాల కోసం వీడీసీ ఆధ్వర్యంలో నెల క్రితం ఇసుక వేలం నిర్వహించారు. కొంత మంది వ్యక్తులు కలిసి సుమారు రూ.51లక్షలకు పాడి ఆ స్ట్రీమ్‌ను కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం పెన్‌గంగలో వరద ప్రవాహం ఉండడంతో ఇసుక తవ్వే పరిస్థితి లేదు. ఉధృతి తగ్గగానే తవ్వకాలు చేపట్టేందుకు వేలం కైవసం చేసుకున్న వారు సిద్ధమవుతున్నారు. ఈ ఒక్క వీడీసీనే కాదు.. నది పరీవాహక ప్రాంతాల్లోని చాలా గ్రామ అభివృద్ధి కమిటీలు ప్రస్తుతం వేలం నిర్వహణపై దృష్టి సారిస్తున్నాయి.



ఆనంద్‌పూర్‌లోని పెన్‌గంగ వద్ద ట్రాక్టర్లలో ఇసుక తరలింపు (ఫైల్)

- మొదలైన ఇసుక వేలం
- రంగంలోకి వీడీసీలు
- ఇటీవల అనంద్‌పూర్‌లో పూర్తి
- త్వరలోనే మిగతా చోట్ల కూడా.. ?
- వేసవిలో ప్రభుత్వ పకడ్బందీ చర్యలతో నియంత్రణ

నిబంధనలు తూచ్..
గత వేసవిలో పెన్‌గంగ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల విషయంలో కలెక్టర్ రాజర్షిషా కొన్ని నిబంధనలను అమలు చేశారు. ప్రస్తుతం వాటి ని తుంగలో తొక్కుతూ వీడీసీలు మళ్లీ తమ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాయి. రాజకీయ అండతో ఆ స్ట్రీమ్‌లను కైవసం చేసుకునే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అందులో భాగంగానే ఆనంద్‌పూర్‌లో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. మిగతా స్ట్రీమ్‌లపై కూడా వారు దృష్టి సారించారు. ప్రభుత్వ అవసరాలకు, ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకు ఇసుక లభించాలని, స్థానిక అవసరాలకు కూడా జనానికి ఇసుక అందుబాటు ధరలో ఉండాలని పలు నిబంధనలను తీసుకొచ్చారు. అయితే అవి అమలు కావడం లేదు.

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్రంలో ఇసుక రిచ్‌ల విషయంలో కఠిన నియమావళి అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తక్కువ ధరలో ఇసుక లభ్యత ఉండాలని కలెక్టర్లకు సూచించింది. ఈ క్రమంలో జిల్లాలో ఇసుక లభ్యతపై కలెక్టర్ రాజర్షిషా దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్, రెవెన్యూ, భూగర్భజల, సాగునీటి పారుదల శాఖల అధికారులు గత ఏప్రిల్‌లో సంయుక్తంగా జిల్లాలో పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో పరిశీలన చేశారు. పది స్ట్రీమ్‌ల వద్ద లభ్యత ఉందని చెబుతూ అక్కడ తవ్వకాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. ప్రధానంగా జిల్లాలోని బేల, జైనథ్, భోరజ్, భీంపూర్ మండలాలకు పెన్‌గంగ పరీవాహకంగా ఉంది. ఈ మండలాల్లోని పలు గ్రామాల్లో ఇసుక తవ్వకాలు ఏటా చేపడతారు. ముందు నుంచి గ్రామాల్లో వీడీసీలు ఇసుక వేలం యథేచ్ఛగా నిర్వహిస్తూ కాంట్రాక్టర్లకు సైట్‌లను అప్పగించేవారు. తద్వారా గ్రామానికి ఆదాయం లభించేది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఆ వీడీసీలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ విషయంలో సీరియస్‌గా వ్యవహరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు. దీంతో ఇక వీడీసీల దందా ఆగిపోయినట్టేనని అంతా భావించారు.

మళ్లీ జడలు విప్పుతున్న వీడీసీలు..
గత వేసవిలో రెవెన్యూ, పోలీసు శాఖలు వీడీసీల విషయంలో కఠినంగా వ్యవహరించడంతో ఇసుక దందా చేసే పలువురు స్తబ్దుగా ఉంటూ వచ్చారు. అనంతరం వానాకాలం రావడం, మళ్లీ సీజన్ విషయంలో ఇప్పుడు ఆనంద్‌పూర్‌లో వేలం నిర్వహించగా, మిగతా చోట్ల కూడా అందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తద్వారా జిల్లాలో మళ్లీ వీడీసీ జడలు విప్పుతుందన్న ప్రచారం సాగుతుంది. ఆనంద్‌పూర్‌లో వీడీసీకి లక్షల రూపాయలు చెల్లించి స్ట్రీమ్‌ను కైవసం చేసుకున్న కాంట్రాక్టర్లు పెన్‌గంగలో వరద ప్రవాహం తగ్గగానే తవ్వకాలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తాం..
నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేపట్టడం, వీడీసీలు వేలం నిర్వహించడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తాం. గతంలో తర్వంలో కేసు నమోదు చేశాం. జైలుకు కూడా పంపాం. – అఖిల్ మహాజన్, ఎస్పీ

సైబర్ వల..

సామాన్యులు విలవిల

- నేరడిగొండలో ఇటీవల ఓ వ్యక్తి లోన్ యాప్ ద్వారా మోసపోయాడు. లోన్ వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు తెలిపారు. బాధితుడి నుంచి విడతల వారీగా రూ.1లక్ష 17వేల 700 తీసుకున్నారు.
- ఆదిలాబాద్‌టూటౌన్ పరిధిలో టెలిగ్రామ్ యాప్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. బాధితుడి నుంచి రూ.40వేలు తీసుకున్నారు. ఇదే స్టేషన్ పరిధిలో మరో వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో బొమ్మల కొనుగోలు కోసం విడతల వారీగా రూ.12వేలు చెల్లించి మోసపోయాడు.
- ఆదిలాబాద్ వన్‌టౌన్ పరిధిలో బాధితుడి కుమారుడు ఓ కేసులో ఉన్నాడంటూ కేటుగాళ్లు ఫోన్ చేశారు. ఫేక్ పోలీసు అధికారి పేరిట రూ.30వేలు ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నారు.
- వారం వ్యవధిలో జిల్లాలో 20 సైబర్ కేసులు నమోదయ్యాయి. బాధితులు భారీగా నగదు పోగొట్టుకున్నారు.



- ఆన్‌లైన్‌లో మాటువేసిన కేటుగాళ్లు
- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- లబోదిబోమంటున్న బాధితులు
- సకాలంలో స్పందిస్తే రికవరీ సులువంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేందుకు సైబర్ కేటుగాళ్లు మాటు వేసి ఉంటున్నారు. జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట వీరి ఉచ్చులో పడి అమాయకులు మోసపోతూనే ఉన్నారు. డబ్బులు పోగొట్టుకుంటున్న తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల్లో విద్యావంతులే అధికంగా ఉండటం గమనార్హం. తెలియని లింక్‌లు ఓపెన్ చేయడం, ఓటీపీలు చెప్పడంతో మోసగాళ్లు వారి పని కానిచ్చేస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. విద్యా సంస్థలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నం.1930కు సమాచారం అందించాలని పేర్కొంటున్నారు.

జిల్లాలో పెరుగుతున్న కేసులు..
సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. జిల్లాలో గతేడాది 200కు పైగా కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 165 నమోదైనట్లు సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా రూ.25వేల లోపు ఉన్న బాధితులు 24 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరికి హోల్డ్‌లో పెట్టిన డబ్బులను బ్యాంకుల ద్వారా ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే 35 ఎఫ్ఐఆర్ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. రూ.17లక్షలను లోక్ అదాలత్ ద్వారా బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ సైబర్ క్రైమ్ ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం, మావల పోలీసు స్టేషన్ పరిధిలో, రూరల్ మండలం, ఉట్నూర్‌లో అత్యధికంగా నమోదవుతున్నట్లు చెబుతున్నారు.

బాధితులు మోసపోయిన గంటలోపే ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

నేరాలకు పాల్పడుతున్న తీరిది..
సైబర్ మోసగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఇంటి వద్ద ఉండి ఉద్యోగం చేయవచ్చు.. ఇందుకు కొంత డబ్బు చెల్లించాలని నిరుద్యోగుల నుంచి విడతల వారీగా లాక్కుంటున్నారు. అలాగే ఇన్వెస్ట్ చేస్తే రెండింతలు వస్తాయని మాయమాటలు చెప్పడంతో ఆశపడి కొంత మంది డబ్బులు పోగొట్టుకున్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగం, డిజిటల్ అరెస్టుల పేరిట దండుకుంటున్నారు. వాట్సాప్ కాల్‌చేసి పోలీసులమని చెప్పి భయభ్రాంతులకు గురి చేసి బాధితుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుంటున్నారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచాలని, మీ పిల్లలు మత్తు పదార్థాల కేసుల్లో ఇరుక్కుపోయారని మోసగాళ్లు బాధితుల ఖాతాల్లో నుంచి డబ్బులు మాయం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..
సైబర్‌క్రైమ్ మోసాలపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ కొంత మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. బ్యాంక్ అధికారులు ఎవరు ఓటీపీ, వ్యక్తిగత సమాచారం అడగరు. వివరాలను బ్యాంక్‌కు వెళ్లి మాత్రమే అందజేయాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నం.1930కు సమాచారం అందించాలి. ఏపీకే ఫైల్స్, తెలియని లింకులను ఓపెన్ చేయవద్దు.
– హసీబుల్లా, డీఎస్పీ, సైబర్‌క్రైమ్

ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: గ్రీవెన్స్‌లో బాధితులు అందించే ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 40 మంది నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసులు ప్రజల రక్షణ, భద్రత కోసం ఎల్లవేళలా ముందుంటారని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి రాలేనివారు సమస్యలను వాట్సాప్ నం.8712659973కు పంపించాలని పేర్కొన్నారు. ఇందులో ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, వామన్, పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

యూరియా కష్టాలు



దోప్టాల సహకార సంఘ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

సాత్నాల: రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. మండలంలోని మెడిగూడ(ఆర్) గ్రామ సహకార సంఘ కార్యాలయానికి స్టాక్ వచ్చిందనే సమాచారంతో రైతులు సోమవారం వేకువజామునే చేరుకున్నారు. గంటల తరబడి బారులు తీరి నిరీక్షించారు. కాగా, 444 బ్యాగుల ఎరువును పంపిణీ చేసినట్లు ఏవో జాదవ్ కైలాస్ తెలిపారు.

రైతులకు సరిపడా అందజేయాలి
భీంపూర్: రైతులకు సరిపడా యూరియా అందజేయాలని కోరుతూ మండల కేంద్రంలో రైతులు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. యూరియా కొరతకు కాంగ్రెస్ పార్టీనే ప్రధాన కారణం అని ఆరోపించారు. సమాచారం అందుకున్న ఎస్సై పీర్ సింగ్ నాయక్, ఏవో శ్రీనివాస్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

దోప్టాలలో..
బేల: మండలకేంద్రంలోని డోప్టాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, అన్నదాత కృషి కేంద్రం వద్ద సోమవారం వేకువజాము నుంచే రైతులు బారులు తీరారు. ఒక్కో రైతుకు రెండేసి చొప్పున 888 యూరియా బ్యాగులు పంపిణీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గంటల తరబడి నిరీక్షించినా పలువురు రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.



భీంపూర్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు



మెడిగూడ(ఆర్)లో బారులు తీరిన రైతులు

పునరుద్ధరణపై ఆశలు

- ఆర్టీసీలో యూనియన్లు లేక కార్మికుల తిప్పలు
- పని ఒత్తిడి పెరుగుతుందని ఆవేదన
- ప్రభుత్వం స్పందించాలని విన్నపం



ఆదిలాబాద్ డిపో

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తూ ఇటీవల జీవో జారీ చేసింది. దీంతో ఆయా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. గత ప్రభుత్వం ఆర్టీసీలో ఉద్యోగ, కార్మిక సంఘాలను తొలగించడంతో అప్పటి నుంచి ఉద్యోగులు ఐకమత్యంగా పోరాడలేని పరిస్థితి. ఎలాంటి సమస్యలు ఎదురైనా ఉన్నతాధికారులకు చెప్పుకోలేని దుస్థితి. సంఘాల స్థానంలో వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ తూతూ మంత్రంగానే అవి పని చేస్తున్నాయనే ఆరోపణలు కార్మికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాల జేఏసీని తిరిగి తీసుకురావడంతో ఆర్టీసీలో సైతం కార్మిక సంఘాలను పునరుద్ధరించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.అప్పుడే తమ విజ్ఞప్తులు, ఫిర్యాదులు, సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశాభావం కార్మిక వర్గాల్లో వ్యక్తం అవుతుంది.

వినే నాథుడు లేక..
తమ సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులంతా సమ్మెకు దిగారు. ప్రభుత్వం దిగి వచ్చినప్పటికీ కార్మిక సంఘాల రద్దు నిర్ణయం తీసుకుంది. దీంతో అప్పటినుంచి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ చెప్పుకోలేక కార్మికులు సతమతమవుతున్నారు. తమ సంక్షేమం గురించి ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాలన్న స్వేచ్ఛ సైతం లేకుండా పోయింది. దీంతో కార్మికులపై ఉన్నత స్థాయి ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ పని ఒత్తిడి పెంచుతున్నారనే ఆవేదన వారిలో కనిపిస్తోంది. పనిభారం భరించలేక పలు సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఎంతో మంది అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

సంఘాలు ఉంటేనే సంఘటిత పోరాటం..
క్షేత్రస్థాయిలో ఏ ఉద్యోగికి ఇబ్బంది కలిగినా సంఘాలు ఉంటే వారంతా ఏకతాటిపైకి వచ్చి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. లేకపోతే సదరు ఉద్యోగినే టార్గెట్ చేస్తూ కొంత మంది అధికారులు ఒంటెద్దు పోకడలతో వారిపై సస్పెన్షన్ వేటు సైతం వేసే అవకాశాలు లేకపోలేదు. దీంతో సంఘాల పునరుద్ధరణ జరిగితేనే కార్మికుల గళం సంస్థ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని పలువురు కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

సంఘాలను పునరుద్ధరించాలి



ఇబ్బందులు నడుమ విధులు నిర్వహించాల్సి వస్తోంది. అందాల్సిన బెనిఫిట్స్ రాకుండా ఎంతో మంది కార్మికులు తిప్పలు పడుతున్నారు. యూనియన్లు ఉంటే సంస్థకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఏదీ అడగలేకపోతున్నాం. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంఘాలను పునరుద్ధరిస్తే కార్మికుల న్యాయమైన కోరికలు నెరవేరుతాయి.
– ఎస్.బీ.రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజనల్ ప్రెసిడెంట్

రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి



మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి పనిభారం, ఒత్తిడి పెరిగింది. ఎంతోమంది ఉద్యోగులు టార్గెట్లు సాధించలేక అధికారులు తీసుకునే చర్యలకు బలైపోతున్నారు. యూనియన్లు ఉంటేనే కార్మికుల సంక్షేమం, ఆర్టీసీ ప్రగతి సాధ్యమవుతుంది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంఘాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.
– ఆశన్న, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆదిలాబాద్ డిపో సెక్రటరీ

సంఘాలు ఉంటేనే హక్కుల రక్షణ



ఆర్టీసీ రాబడికి ఎంతగానో కృషి చేస్తున్నాం. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. ఎంతోమంది కార్మికులు పని భారంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. సంఘాలు ఉంటేనే ప్రశ్నించే అవకాశం, కార్మికుల హక్కుల రక్షణ సాధ్యమవుతుంది.
– ఆదిల్ పాషా, ఈయూ రీజినల్ సెక్రెటరీ

లంబాడాలు మా అవకాశాలను కొల్లగొట్టారు

- న్యాయం జరిగే వరకు పోరాటం
- గుడిహత్నూర్‌లో ఆదివాసీల భారీ ర్యాలీ

గుడిహత్నూర్: రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చొరబడిన లంబాడాలు తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొల్లగొట్టారని ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని మాన్కాపూర్ నుంచి మండల కేంద్రం వరకు రెండున్నర కిలోమీటర్లు సాంప్రదాయ వాయిద్యాలతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కవి తారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో తీర్పు వచ్చే వరకు వారికి ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయిసెంటర్ల సార్‌మేడీలు పెందూర్ జైరాం, కాత్లే భరత్, రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు లక్ష్మణ్, భగవాన్, భీంరావ్, జల్పత్, గణేశ్, జంగుపటేల్, మండలంలోని ఆయా గ్రామాల పటేళ్లు, నాయకులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: గ్రామపంచాయతీ కార్మికులకు శాపంగా ఉన్న మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ అన్నారు. సోమవారం యూనియన్ జిల్లా 4వ మహాసభలను మాధవరావు స్మారక విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, ఆశన్న, కిరణ్, స్వామి, చిన్నన్న, అడెల్లు, వెంకట్, సుందర్, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు విని సంబంధిత తహసీల్దార్లు, అధికారులతో జూమ్ ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇకనుంచి ప్రతి సోమవారం జూమ్ ద్వారా అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.ఈ వారం గ్రీవెన్స్‌లో 105 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎస్‌వో వాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

టెట్ మినహాయించాలి
2010 సంవత్సరానికి ముందు ఉద్యోగంలో ప్రవేశించిన సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలని టీపీయూఎస్ నాయకులు కోరారు.ఈ మేరకు కలెక్టర్ రాజర్షిషాను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ కుమార్, గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో మంటలు



ఆర్టీసీ బస్సులో చెలరేగుతున్న మంటలు

ఇచ్చోడ: ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నిజామాబాద్ బయలుదేరింది. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల వద్దకు రాగానే ఒక్కసారిగా ఇంజన్‌లోంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డుపక్కన ఆపి ప్రయాణికులను కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సంఘటన సమయంలో బస్సులో దాదాపుగా 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కొలాంగూడలో ఆలయంలో వెండి ఆభరణాలు దొంగిలించిన టేకం రాజును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామానికి చెందిన కొడప దినేష్ ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఉద్దయ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఇచ్చోడ మండలంలోని దాబా గ్రామానికి చెందిన జాదవ్ ఉద్దయ్ గతనెల 14న ఇంద్రవెల్లి మండలంలోని లాల్‌టెకిడిలో ఉంటున్న బాబాయ్ జాదవ్ ప్రహ్లాద్ ఇంటికి వచ్చాడు. 15న సాయంత్రం ఇంటికి వెళ్తానని చెప్పి బయల్దేరాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

నదీ తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామ గోదావరి నదీ తీరంలో సోమవారం మృతదేహం కొట్టుకువచ్చింది. చేపల వేటకు వెళ్లిన జాలర్లు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రవీందర్ ఘటనా స్థలానికి వెళ్లి జాలర్ల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్‌కు చెందిన భగవాన్‌గా గుర్తించినట్లు ఎస్సై వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన వెల్లడించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డు, స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సంగ రాజుయాదవ్‌కు భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటికి చెందిన జలిగిరి మల్లేశ్ పరిచయం అయ్యాడు. రిమ్స్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఎవరైన ఉంటే చెప్పాలని అనడంతో విషయాన్ని సంగ రాజు యాదవ్ తనకు తెలిసిన పలువురికి చెప్పాడు. 2021 ఆగస్టులో బొడగం నరేష్ నుంచి రూ.60 వేలు, జూకంటి శివ నుంచి రూ.40వేలు, బోంపల్లి లక్ష్మి నుంచి రూ.15 వేలు, బోంపల్లి స్వామి నుంచి రూ.20వేలు, సింగారపు లక్ష్మి నుంచి రూ.15 వేలు, నరేష్ నుంచి రూ.20 వేలు మొత్తం రూ.1.70 లక్షలు తీసుకుని మల్లేశ్‌కు ఇచ్చాడు. ఇప్పటివరకు ఉద్యోగాలు ఇప్పించకపోగా డబ్బులు సైతం తిరిగి ఇవ్వడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పర్యాటకులకు నిరాశే..



అటవీ శాఖ ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు

- అక్టోబర్ మొదటివారంలోనే సఫారీ ప్రయాణం
- ఈనెల 21 నుంచి ముందస్తు దసరా సెలవులు
- ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు అనుమతి నిరాకరణ

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లోని బైసన్‌కుంట, గొండుగూడ బేస్‌క్యాంపు, వాచ్‌టవర్ ప్రదేశాల్లో సఫారీ ప్రయాణం పర్యాటకులకు నిరాశే మిగిలింది. దసరా సెలవులు ముందుగానే ఈనెల 21 నుంచే ప్రారంభమవుతున్నాయి. హైదరాబాద్, వరంగల్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అటవీశాఖ ఇచ్చిన సమయం ప్రకారం అక్టోబర్ మొదటివారంలో సఫారీ ప్రయాణం ప్రారంభమవుతుంది. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు అడవిలోకి వాహనాలను అనుమతించరు. వన్యప్రాణులు ఎదకు వచ్చే సమయంలో అలజడి లేకుండా చూస్తారు. వర్షాల కారణంగా రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. అందుకే సఫారీ ప్రయాణాన్ని మూడు నెలలపాటు అధికారులు నిషేధిస్తారు.

అనుమతి తప్పనిసరి

పర్యాటక శాఖ రెండు, అటవీశాఖ ఐదు సఫారీలు ఏర్పాటు చేశారు. జూలై నుంచి సెప్టెంబర్‌లో పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. దసరా నుంచి మళ్లీ తిరిగి వారి సంఖ్య పెరుగుతుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సఫారీ ప్రయాణానికి అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ఉంటుంది. అడవిలో పర్యాటకుల కోసం ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేశారు.

పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది



ఏటా జూలై నుంచి సెప్టెంబర్‌లో సఫారీ ప్రయాణానికి అటవీ అధికారులు అనుమతి ఉండదు. అక్టోబర్‌లో సఫారీ మొదలవుతుంది. దసరా సెలవుల్లో పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. సెప్టెంబర్ 21 నుంచి సెలవులు కారణంగా సఫారీకి అనుమతి ఉండదు. ఈ విషయంలో అటవీ అధికారులు ఆలోచించాలి.

– వీరేందర్, హరిత రిసార్ట్ మేనేజర్

అక్టోబర్ మొదటి వారంలో..



వర్షాల కారణంగా సఫారీ ప్రయాణించే రోడ్లు కొట్టుకుపోతాయి. పర్యాటక శాఖ అధికారులు ఈ విషయంలో సంప్రదించారు. కాని వర్షాలు పడుతున్నందున వన్యప్రాణులు సంతతి పెంచుకుంటాయి. వాటి స్వేచ్ఛకు భంగం కలుగకుండా చూడాలి. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్టోబర్ మొదటి వారంలోనే సఫారి ప్రయాణానికి అనుమతి ఉంటుంది.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

పరవళ్లు తొక్కుతున్న 'గొల్లవాగు'



భీమారంలో గొల్లవాగువద్ద జలపాతం

భీమారం మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద ఏర్పడ్డ జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ నిండడంతో మత్తడిద్వారా వచ్చిన వరదనీరు వాగులో కలిసేచోట రాళ్లపై జారుతున్న జలపాతం సందర్శకులను కనువిందు చేస్తోంది. – భీమారం

యాత్రాదానానికి దాతలు ముందుకు రావాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్



భవానీ ప్రసాద్

ఆదిలాబాద్: ఆర్టీసీ ప్రారంభించిన యాత్రాదానం కార్యక్రమానికి విరాళాలు ఇవ్వడానికి దాతలు ముందుకు రావాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్.భవానీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఈ నూతన కార్యక్రమానికి సంస్థ శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వ్యక్తుల పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాల వంటి ప్రత్యేకమైన రోజుల్లో అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థుల యాత్రలకు ఈ కార్యక్రమాల ద్వారా విరాళాలు అందించవచ్చన్నారు. వీరందరినీ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు తీసుకెళ్లడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రత్యేక రోజున అవసరమైన విరాళాన్ని సంస్థకు అందిస్తే ఆర్టీసీ ఎంపిక చేసిన ప్రయాణికులకు బస్సు సదుపాయం కల్పిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్నారైలు, సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో విరాళం చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. దాతలు చెల్లించే విరాళానికి అనుగుణంగా కిలోమీటర్ల ప్రాతిపదికన విహారయాత్రలకు ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను సంస్థ ఏర్పాటు చేస్తుందన్నారు. సరికొత్త కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా దాతలు ముందుకు రావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల పరిధిలో 9959226002, నిర్మల్ డిపో పరిధిలో 9959226003, భైంసా డిపో పరిధిలో 9959226005, ఆసిఫాబాద్ డిపో పరిధిలో 995926006, మంచిర్యాల డిపో పరిధిలో 9959226004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



మృతదేహానికి పంచనామా చేస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుఉంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని హన్మంతుపల్లె గ్రామానికి చెందిన జెడ కిష్టయ్య (36) కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం పంట పొలాలకు అవసరమయ్యే పురుగు మందులు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లగా అవసరం ఉన్నదానికంటే ఎక్కువ ఎందుకు తీసుకు వచ్చావని అతని రెండో భార్య లక్ష్మి మందలించింది. అప్పటికే అతను మద్యం మత్తులో ఉండటంతో ఇద్దరు గొడవపడ్డారు. దీంతో ఆమె గ్రామంలోని తెలిసిన వారి ఇంటికి వెళ్లింది. సోమవారం ఇంటికి వచ్చి చూసే సరికి కిష్టయ్య వాంతులు చేసుకుంటున్నాడు. పురుగుల మందుతాగానని చెప్పడంతో వెంటనే ముందుగా లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంజేపీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఈత పోటీల్లో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో బ్యాక్‌స్ట్రోక్, ఫ్రీ స్టైల్ అంశాల్లో పదోతరగతి చదువుతున్న ఎస్.అరవింద్, అండర్–17 విభాగంలో బ్యాక్‌స్ట్రోక్ అంశంలో తొమ్మిదోతరగతి చదువుతున్న టి.అభిరామ్, అండర్–14 విభాగంలో ఫ్రీ స్టైల్ అంశంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.హర్ష ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సదరు విద్యార్థులను ఎంజేపీ ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ, ప్రిన్సిపాల్ సేరు శ్రీధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ సురేశ్, పీఈటీ నగేశ్, అధ్యాపక బృందం అభినందించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి

బెల్లంపల్లిరూరల్: విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బండి రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెర్కపల్లికి చెందిన కర్రె శంకర్ (శంకరయ్య) (55) సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ బోర్డు నుంచి పొగలు రావడంతో దగ్గరకు వెళ్లి వైర్లను తాకగా సర్వీస్ వైర్ తెగి అతని చేతికి తగిలింది. విద్యుత్ షాక్‌కు గురికావడంతో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య లక్ష్మి, కుమార్తె ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు..

మంచిర్యాలక్రైం: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మజారొద్దీన్ తెలిపిన వివరాల మేరకు తిలక్‌నగర్‌కు చెందిన ఆకుల ఈశ్వర్‌ప్రసాద్ (17) ఈ నెల 13న బిర్యానీ తినేందుకు అతని బాబాయ్ కుమారుడైన రఘువీర్‌తో కలిసి బైక్‌పై మంచిర్యాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సూర్యనగర్ రోడ్డునంబర్ 5 వద్దకు రాగానే మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన శ్రీకాంత్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈశ్వర్‌ప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఈనెల 14న హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈశ్వర్ ప్రసాద్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందడంతో బాబాయ్ శివకృష్ణ వద్ద ఉంటున్నాడు. శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ప్రశంసపత్రం అందుకుంటున్న వినోద్‌కుమార్

జన్నారం: మండలంలోని మహ్మదబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్‌కుమార్ ఈ నెల 14న నల్గొండలో జరిగిన 12వ సీనియర్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 9 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొనున్నాడు. తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మనోహర్ చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు ప్రశంసపత్రం అందుకున్నారు.

18న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 18న బాలబాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ పటేల్ కాలేజీలోని సాధన డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీలో 35వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ సమీపంలోని ముప్కల్ గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 18న ఉదయం 9 గంటలకు అకాడమీ వద్దకు వచ్చి రిపోర్టు చేయాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు 99120 29691 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు పాఠశాలల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాకు వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసాచారిని నియమించారు. పది పాఠశాలలను పర్యవేక్షించి 23 అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. వీటిలో విద్యార్థుల నమోదు, ప్రీప్రైమరీ స్కూల్, యూడైస్, అపార్, విద్యార్థుల సామర్థ్యాలు, కంప్యూటర్ల మరమ్మతులు, పారిశుధ్యం, ఎఫ్‌ఆర్‌ఎస్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాల సరఫరా, పాఠశాలలో మౌలిక వసతులు, పెండింగ్‌లో ఉన్న పనులు, ఎఫ్‌ఎల్‌ఎం, పీఎం పోషణ్, పీఎంశ్రీ, భవిత సెంటర్లు, క్లాస్‌రూమ్ ట్రాన్‌జాక్షన్ తదితర అంశాలను పరిశీలించి లోపాలను పాఠశాల డైరెక్టర్‌కు నివేదించనున్నారు. ఈ నివేదిక ప్రకారం ప్రభుత్వ పాఠశాలల, ఉపాధ్యాయుల పనితీరు తేటతెల్లం కానుంది. ఏయే పాఠశాలలను తనిఖీ చేస్తారనేది అప్పటికప్పుడే నిర్ణయించనున్నారు. వీరి వెంట జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు ఉండనున్నారు.

పాత నేరస్తుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన పాత నేరస్తుడు ఎస్‌డీ ముషరఫ్ అలియాస్ బడా ముషరఫ్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. నిందితుడిపై గతంలో గంజాయి, దొంగతనం కేసులు ఉండగా చిల్కూరి లక్ష్మీనగర్‌లో దొంగతనానికి పాల్పడ్డ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితునికి గంజాయి పరీక్ష నిర్వహించగా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు తెలిపారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

జైపూర్: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో నుంచి 35 శాతం కార్మికులకు చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీపీపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు జరిగిన స్ట్రక్చరల్ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్స్‌పై యాజమాన్యం ఇప్పటివరకు సర్క్యులర్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ 12న జరగాల్సిన స్ట్రక్చరల్ సమావేశాన్ని బాయ్‌కట్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే. బాజీసైదా, నాయకులు బాలకృష్ణ, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేశ్, దేవేందర్, సత్తయ్య, నవీన్, పద్మరాజ్, శ్రీనివాస్, సతీశ్, సంజీవ్, యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ పీవో చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆదిలాబాద్ మండలం మావలకు చెందిన గోదావరి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని, జైనూర్ మండలం భూసిమెట గ్రామస్తులు సీసీరోడ్డు మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం ఛాప్రాలకు అంగన్‌వాడీ సెంటర్ మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జన్నారం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ ఖేల్ కన్వీనర్ పందిరి మనీష్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ ఖేల్ కాలేజ్ ప్రెసిడెంట్ రిశ్వంత్, సెక్రటరీ అంజేష్, నాయకులు మహేష్, అమన్, అభిలాష్, సాయి, సంజయ్, అధికసంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే



బాసర: నివాళులర్పిస్తున్న అధికారులు



జైపూర్: నివాళులర్పిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

బాసర: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం బాసర ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల అధిపతులు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చాన్సలర్ గోవర్ధన్ మాట్లాడుతూ కళాశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడానికి అవసరమైన అన్ని రకాల అధునాతన లాబొరేటరీస్ అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్టీపీపీలో...

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో భారతదేశ తొలి ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ నేడు ప్రతీపని ఇంజినీరింగ్‌తో ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం నరసింహారావు, సీఎంవోఏఐ బ్రాంచ్ సెక్రెటరీ సంతోశ్‌కుమార్, ఏజీఎంలు మురళీధర్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, పంతులా, కిరణ్‌బాబు, పాల్గొన్నారు.

భూ రికార్డుల తరలింపు



వాహనంలో తరలిస్తున్న రికార్డులు

కైలాస్‌నగర్: సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖకు సంబంధించిన భూ రికార్డుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాల పునర్విభజన జరిగి తొమ్మిదేళ్లు గడుస్తున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన రికార్డుల నిర్వహణ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగానే కొనసాగుతోంది. అయితే ఇటీవల కలెక్టరేట్ ఏ బ్లాక్ అంతస్తు పైకప్పు కూలిన నేపథ్యంలో అక్కడి కార్యాలయాల తరలింపు అనివార్యంగా మారింది. దీంతో ఇన్నాళ్లు ఉమ్మడి జిల్లాగా కొనసాగిన భూ రికార్డులు, దస్త్రాల తరలింపును ఆయా జిల్లాలకు తరలించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు సంబంధించిన భూ రికార్డులను ఆయా జిల్లాలకు తరలించారు. తాజాగా నిర్మల్ జిల్లాకు సంబంధించిన భూ రికార్డులను సోమవారం ప్రత్యేక వాహనంలో తరలించారు. భూమికి సంబంధించిన నక్షలు, టిప్పన్‌లు, తదితర రికార్డులను ఆ జిల్లాకు సంబందించిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు తీసుకెళ్లారు. ఎంతో కీలకమైన ఈ భూ రికార్డుల తరలింపులో సంబంధిత శాఖాధికారులు అందుబాటులో ఉండకుండా కేవలం తాత్కాలిక అప్రెంటిస్‌షిప్‌లో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్లపై ఆధారపడడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఎమైనా రికార్డులు తప్పిపోతే బాధ్యులేవరనే ప్రశ్నలు తలెత్తాయి. అధికారులు దగ్గరుండి తరలించాల్సిన రికార్డులను కేవలం అప్రెంటిస్ సిబ్బందిపై ఆధారపడి తరలించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.